సాక్షి
మంచిర్యాల

సోమవారం । 17 । జూన్ । 2024



లెక్క తేలుతోంది!
కవ్వాల్ టైగర్‌జోన్‌లో నాలుగో విడత వన్యప్రాణుల గణన మొదలైంది. అడవిలో తిరిగే పులులు, చిరుత పులులతోపాటు మాంసహార, శాకాహార వన్యప్రాణులను లెక్కిస్తున్నారు. 8లో▸



త్యాగానికి ప్రతీక బక్రీద్
అల్లా పంపిన ప్రవక్తల్లో ఒకరైన హజరత్ ఇబ్రహీం త్యాగానికి ప్రతీకగా జరుపుకునే పండుగ బక్రీద్. సోమవారం బక్రీద్ పండుగ నేపథ్యంలో ప్రత్యేక కథనం. 8లో▸

గరిష్టం/కనిష్టం
37.4 /28.5

వాతావరణం
ఆకాశం చాలావరకు మేఘవృతమై ఉంటుంది. రుతుపవనాలు, ఉపరిత ద్రోణి కారణంగా అక్కడక్కడా వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

కలెక్టర్‌తో జీఎం భేటీ



కలెక్టర్‌కు పుష్పగుచ్ఛం అందిస్తున్న జీఎం

శ్రీరాంపూర్: జిల్లా నూతన కలెక్టర్‌గా బదిలీపై వచ్చిన కుమార్ దీపక్‌ను శ్రీరాంపూర్ జీఎం బి.సంజీవరెడ్డి ఆదివారం మర్యాద పూర్వకంగా కలిశారు. సీసీసీలోని సింగరేణి గెస్టుహౌస్‌లో కలిసి పుష్పగుచ్ఛం అందించారు. శ్రీరాంపూర్ ఏరియాలో సింగరేణి విశిష్టతను ఆయనకు తెలియజేశారు. కార్యక్రమంలో సింగరేణి అధికారుల సంఘం ఏరియా అధ్యక్షుడు కె.వెంకటేశ్వర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సంఘం సభ్యుల సంక్షేమానికి పెద్దపీట

- పీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు ఇన్నారెడ్డి



చెక్కు అందజేస్తున్న ఇన్నారెడ్డి

జన్నారం: పీఆర్టీయూ సంఘంలో సభ్యత్వం ఉన్న సభ్యుల సమస్యల పరిష్కారానికి, సంక్షేమానికి కృషి చేస్తామని జిల్లా అధ్యక్షుడు తిరుమల రెడ్డి ఇన్నారెడ్డి అన్నారు. జన్నారంలోని పీఆర్టీయూ భవన్‌లో ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన దేవోజీ కుటుంబానికి సంఘం తరపున రూ.లక్ష నగదు ఆదివారం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంఘంలోని సభ్యులు ఎవరైనా మరణిస్తే వారి కుటుంబానికి అండగా నిలిచి ఆర్థిక సహాయం అందించే సంఘం కేవలం పీఆర్టీయూ మా త్రమే అని అన్నారు. కార్యక్రమంలో పీఆర్టీ యూ జిల్లా ప్రధాన కార్యదర్శి కొట్టె శంకర్, మండల అధ్యక్షుడు కట్ట రాజమౌళి, ప్రధాన కార్యదర్శి సత్యనారాయణ, ఎంఈవో విజయ్‌కుమార్, రవి, జిల్లా సభ్యులు శ్రీని వాస్, ప్రవీణ్‌కుమార్, శ్రీనివాస్, తిరుపతి పాల్గొన్నారు.

బీసీ కులగణనపై రేపు నిరసన దీక్ష

పాతమంచిర్యాల: బీసీ కులగణన చేపట్టాలనే డిమాండ్‌తో జిల్లా కేంద్రంలోని గాంధీపార్కు వద్ద ఈ నెల 18న నిరసదీక్ష చేపట్టనున్నట్లు జాతీయ బీసీ హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు గుమ్ముల శ్రీనివాస్ తెలిపారు. బీసీ కులగణన చేపట్టిన తర్వాతే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని కోరారు. నిరసన దీక్షకు బీసీ కులసంఘాల నాయకులు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు.

అలరించిన కవితాగానం

మంచిర్యాలఅర్బన్: జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేట పాఠశాలలో సాహితీ సంరక్షణ సమితి ఆధ్వర్యంలో ఆదివారం కవి సమ్మేళనం నిర్వహించరు. కవి, తెలంగాణ తొలి, మలిదశ ఉద్యమకారుడు మలయశ్రీ మాట్లాడుతూ విద్యార్థుల్లో తెలుగు భాషపై, కవిత్వంపై చైతన్య వంతులుగా తీర్చిదిద్దే దిశగా సాహితీ సంరక్షణ సమితి కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో కవులు, రచయితలు దాసరి శ్రీనాథ్‌గౌడ్, భూపతి, సంతోష్, వామన్‌రావు పాల్గొన్నారు.

గుండె జబ్బులపై జాగ్రత్తగా ఉండాలి

శ్రీరాంపూర్: గుండె జబ్బులపై ప్రతిఒక్కరూ జాగ్రత్త ఉండాలని శ్రీరాంపూర్ జీఎం బి.సంజీవరెడ్డి తెలిపారు. సీఎంఓఏఐ ఆధ్వర్యంలో హైదరాబాద్ కేర్ ఆస్పత్రి వైద్యులతో సీసీసీలోని ఇల్లెందు క్లబ్‌లో అధికారుల కుటుంబాలకు ఆదివారం గుండె జబ్బుల నిర్ధారణ పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా జీఎం మాట్లాడుతూ గుండె జబ్బులకు ప్రధాన కారణం ఆహార అలవాట్లు, శారీరకశ్రమ లేకపోవడం, ఒత్తిడికిగురి కావడం వంటివన్నారు. సుమారు 150 మందికి రక్త పరీక్షలు, ఈసీజీ, 2డీ ఇకో పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో ఏరియా సేవా అధ్యక్షురాలు రాధాకుమారి, అధికారుల సంఘం ఏరియా అధ్యక్షుడు వెంకటేశ్వర్‌రెడ్డి, కార్యదర్శి ఎంవీఎ.చంద్రశేఖర్, ఉపాధ్యక్షుడు కిరణ్‌కుమార్, కంపెనీ వైద్యులు రమేశ్‌బాబు, లోక్‌నాథ్‌రెడ్డి పాల్గొన్నారు.

బదిలీ అయినా.. బాధ్యతలే!

- జిల్లా మారిన హెచ్‌ఎంలనే ఎంఈవోలుగా కొనసాగింపు
- కుమురంభీం జిల్లాలో ముగ్గురు, మంచిర్యాల జిల్లాలో ఇద్దరు ఇతర జిల్లాలకు..
- అక్కడ హెచ్‌ఎంగా.. ఇక్కడ ఇన్‌చార్జి ఎంఈవోగా విధులు..



మంచిర్యాలఅర్బన్: జిల్లాలో పాఠశాలల పర్యవేక్షణ ప్రశ్నార్థకంగా మారింది. జిల్లాలు, మండలాలు దాటి బదిలీ అయిన ప్రధానోపాధ్యాయులకే ఇన్‌చార్జి ఎంఈవోలుగా బాధ్యతలు కొనసాగిస్తుండడంతో బదిలీ స్థానంలో హెచ్‌ఎంగా, పాత మండలంలో ఇన్‌చార్జి ఎంఈవోగా విధులు నిర్వహించడం సవాల్‌గా మారింది. ఇప్పటికే జిల్లాల పునర్విభజనతో ఏర్పడిన కొత్త మండలాలకు ఎంఈవోలను నియమించలేదు. మరోవైపు పాత మండలాలకు ఉన్న ఇన్‌చార్జి ఎంఈవోలు ఇటీవల నిర్వహించిన హెచ్‌ఎంల బదిలీల్లో ఇతర జిల్లాలకు వెళ్లిపోయారు. ఒకవైపు కొత్త మండలాలకు ఎంఈవోలు లేకపోగా, ప్రస్తుతం పాత మండలాల ఇన్‌చార్జి ఎంఈవోలు బదిలీ కావడంతో వారి పరిధిలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలను పర్యవేక్షించడం తలకు మించిన భారంగా మారింది.

ఒకే ఒక్కడు..

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో 69 మండలాలు ఉన్నాయి. వీటికి కేవలం 26 మంది హెచ్‌ఎంలే ఇన్‌చార్జి ఎంఈవోలుగా కొనసాగుతున్నారు. కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లా కౌటాలకు మాత్రమే పర్మినెంట్ ఎంఈవో ఉన్నారు. మరోవైపు ఇటీవల నిర్వహించిన బదిలీలతో 26 మందిలో చాలా వరకు పక్క జిల్లాలు, వేరే మండలాలకు హెచ్‌ఎంగా వెళ్లిపోయారు. అయినా వారినే ఇన్‌చార్జి ఎంఈవోలుగా కొనసాగిస్తున్నారు. దీంతో పాఠశాల పర్యవేక్షణ బదిలీ అయిన వారికి ఇబ్బందికరంగా మారింది.

జిల్లా దాటినా..

జిల్లాలో ఉంటే సమయం చూసుకుని పాఠశాల హెచ్‌ఎం, ఎంఈవోల విధులు నిర్వహించడం కొంతమేర సాధ్యం అవుతుంది. నిర్మల్, ఆదిలాబాద్ మినహాయిస్తే మంచిర్యాల, ఆసిఫాబాద్ జిల్లాలో విధులు నిర్వహించే ఇన్‌చార్జి ఎంఈవోలు ఇతర జిల్లాలోని పాఠశాలలకు హెచ్‌ఎంలుగా వెళ్లిపోయారు. అయినా వారిని ఇన్‌చార్జి ఎంఈవోల బాధ్యతల నుంచి తప్పించలేదు. మంచిర్యాల జిల్లాకు చెందిన రవీందర్ లక్సెట్టిపేట, దండేపల్లి మండలాల ఇన్‌చార్జి ఎంఈవోగా విధులు నిర్వహించారు. ఇటీవలి బదిలీల్లో కరీంనగర్ జిల్లా నగునూర్ పాఠశాలకు వెళ్లిపోయారు. కాసిపేట (మూడు నెలల బాధ్యతలు), తాండూర్ ఇన్‌చార్జి ఎంఈవోగా బాధ్యతలు నిర్వహించిన ప్రభాకర్ కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లాకు ట్రాన్స్‌ఫర్ అయ్యారు. ఇక కుమురంభీం జిల్లాలో హెచ్‌ఎంతోపాటు రెబ్బెన, తిర్యాణి మండలాల ఇన్‌చార్జి ఎంఈవోగా విధులు నిర్వహించే వెంకటస్వామి మంచిర్యాల జిల్లా కాసిపేట్ మండలంలోని ఓ పాఠశాలకు బదిలీపై వచ్చారు. కుమురంభీం జిల్లా చింతలమానేపల్లి, కాగజ్‌నగర్ మండలాల ఇన్‌చార్జి ఎంఈవోగా పనిచేసిన భిక్షపతి హన్మకొండ జిల్లాకు వెళ్లిపోయారు. వాంకిడి, ఆసిఫాబాద్ మండల ఇన్‌చార్జి ఎంఈవో రాథోడ్ మానుకుమార్ ఆదిలాబాద్ జిల్లాకు బదిలీ య్యారు. మంచిర్యాల జిల్లా కోటపల్లి, వేమనపల్లి మండలాల ఇన్‌చార్జి ఎంఈవో తిరుపతిరెడ్డి హాజీ పూర్ మండలంలోని ఓపాఠశాల హెచ్‌ఎంగా బా ధ్యతలు స్వీకరించారు. మందమర్రి, మంచిర్యాల, నస్పూర్, హాజీపూర్ ఎంఈవో పోచయ్య బెల్లంపల్లికి బదిలీ అయ్యారు. అయినా వీరిని ఇన్‌చార్జి ఎంఈవో బాధ్యతల నుంచి రిలీవ్ చేయడం లేదు.

ఏకీకృత సర్వీస్‌రూల్స్ కారణంగా..

రాష్ట్రంలో ఏకీకృత సర్వీస్‌రూల్స్ అంశం సుప్రీం కోర్టులో ఉండడంతో ఎంఈవో నియామకాలు నిలిచిపోయాయి. దీంతో సీనియర్ ప్రధానోపాధ్యాయులను ఇన్‌చార్జి మండల విద్యాధికారులుగా ప్రభుత్వం నియమించింది. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లాలో ఒక్క రెగ్యులర్ ఎంఈవో మినహా.. ఆదిలాబాద్ జిల్లాలో 18 మండలాలకు 08, మంచిర్యాల జిల్లాలో 18 మండలాలకు ఏడుగురు, నిర్మల్ జిల్లాలో 18 మండలాలకు ఆరుగురు, ఆసిఫాబాద్ జిల్లాలో 15 మండలాలకు ఐదుగురు హెచ్‌ఎంలు ఇన్‌చార్జి ఎంఈవోలుగా కొనసాగుతున్నారు. తాజా బదిలీల్లో కుమురంభీం జిల్లా నుంచి ముగ్గురు, మంచిర్యాల జిల్లా నుంచి ఇద్దరు బదిలీ అయ్యారు. అయినా వీరినే ఇన్‌చార్జి ఎంఈవోలుగా కొనసాగిస్తున్నారు.

సర్వీస్ రూల్స్ పరిష్కారమైతేనే..

ఏళ్లుగా ఉమ్మడి సర్వీస్ రూల్స్‌కు సంబంధించి కేసు కోర్టులో పెండింగ్‌లో ఉంది. ఇది పరిష్కారమైతేనే ఎంఈవోలను నియమించే అవకాశం ఉంటుంది. కేసు పరిష్కారం దిశగా ప్రభుత్వం, ఉపాధ్యాయ సంఘాలు చొరవ చూపాల్సిన అవసరం ఉంది.

ఎంపీఈవోలను నియమించాలి..



న్యాయస్థానంలో కేసు పెండింగ్ కారణంగా ఎంఈవోల నియామకం నిలిచిపోయింది. తెలంగాణ విద్యాశాఖ పర్యవేక్షణ బాగుండాలంటే మండల పరిషత్ ఎడ్యుకేషన్ ఆఫీసర్ పోస్టులు సృష్టించాలి. సీనియర్ హెచ్‌ఎంలతో వాటిని భర్తీ చేయాలి. పాత ఎంఈవోలు ఉంటే నిర్మాణ కార్యక్రమాలు అప్పగించాలి. కొత్త ఎంపీఈవోలకు పాఠశాలల పర్యవేక్షణ అప్పగించాలి. ఏకీకృత సర్వీస్‌రూల్స్ కేసు పరిష్కారం అయ్యేలా ప్రభుత్వం చొరవ చూపాలి.

– ఇన్నారెడ్డి, పీఆర్టీయూటీఎస్ జిల్లా అధ్యక్షుడు

పునర్వ్యవస్థీకరించాలి..



రాష్ట్రంలో 99 శాతం ఎంఈవో పోస్టుల్లో గెజిటెడ్ ప్రధానోపాధ్యాయులు ఇన్‌చార్జీ లుగా ఉన్నారు. ఒక్కో ఇన్‌చార్జి ఎంఈవో మూడు నుంచి నాలుగు మండలాల బాధ్యతలు నిర్వహించారు. గతేడాది చేపట్టిన బదిలీలతో వీరు ఇతర జిల్లాలకు మారారు. దీంతో పాఠశాలల పర్యవేక్షణ కష్టతరమవుతుంది. ఈ నేపథ్యంలో విద్యా వ్యవస్థను పటిష్టం చేసేలా ఎంఈవో పోస్టులను పునర్వ్యవస్థీకరించాలి.

– రవీందర్, టీయూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి

బాధ్యతలు స్వీకరించిన కలెక్టర్



బాధ్యతలు స్వీకరించిన కలెక్టర్ కుమార్‌దీపక్

మంచిర్యాలఅగ్రికల్చర్: జిల్లా కలెక్టర్‌గా బదిలీపై వచ్చిన నాగర్ కర్నూల్ అదనపు కలెక్టర్ కుమార్ దీపక్ కలెక్టరేట్‌లో ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. అదనపు కలెక్టర్లు రాహుల్(స్థానిక సంస్థలు), మోతిలాల్(రెవెన్యూ), మంచిర్యాల ఆర్డీవో రాములు, కలెక్టరేట్ ఏవో రాజేశ్వర్, ఎన్నికల విభాగం తహసీల్దార్ శ్రీనివాస్, నస్పూర్ తహసీల్దార్ శ్రీనివాస్ స్వాగతం పలికి పుష్పగుచ్ఛం అందజేశారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ ప్రజా శ్రేయస్సుకు, జిల్లా అభివృద్ధికి సమష్టిగా పనిచేద్దామన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాల ఫలాలను జిల్లాలో అర్హులకు అందే విధంగా చూడాలన్నారు.

పండుగ ప్రశాంతంగా జరుపుకోవాలి

- సీపీ శ్రీనివాసులు

మంచిర్యాలక్రైం: మతసామరస్యాన్ని కాపాడుతూ పండుగలను ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని రామగుండం పోలీస్ కమిషనర్ ఎం.శ్రీనివాసులు సూచించారు. సోషల్ మీడియాలో వచ్చే వదంతులను ఎవరూ నమ్మొద్దని సూచించారు. ఎక్కడైన, ఏదైన సమస్య ఉత్పన్నమైతే పోలీసుల దృష్టికి తీసుకురావాలని సూచించారు. బక్రీద్ పండుగ నేపథ్యంలో కమిషనరేట్ పరిధిలోని మంచిర్యాల, పెద్దపెల్లి జిల్లా ప్రజలు మతాలకు అతీతంగా సోదరభావంతో పండగ జరుపుకోవాలన్నారు. కమిషనరేట్ పరిధిలో అవాంఛనీయ ఘటనలు జరుగకుండా మసీదులు, ఈద్గాల వద్ద బందోబస్తు ఏర్పాటు చేశామని తెలిపారు. బక్రీద్ పండగ సందర్భంగా 15 రోజుల ముందు నుంచి సరిహద్దుల్లో చెక్ పోస్టులు ఏర్పాటు చేసి ఆవులను అక్రమంగా తరలించకుండా తనిఖీలు చేశామని వివరించారు. సోషల్ మీడియాలో మతాలను కించపరిచేలా, వ్యక్తిగతంగా అసభ్యకరంగా పోస్టులు పెడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

‘ధరణి’పై ఫోకస్

- దరఖాస్తులు త్వరితగతిన పరిష్కరించేలా ప్రభుత్వం చర్యలు
- ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో 17వేల వరకు పెండింగ్



కైలాస్‌నగర్: ధరణి దరఖాస్తుల పరిష్కారంపై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. ఈ నెల 14న జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించిన సీసీఎల్ఏ కమిషనర్ నవీన్ మిట్టల్ పెండింగ్‌లో ఉన్న ధరణి దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు. మాడ్యూల్స్ వారీగా క్షేత్రస్థాయి పరిశీలనతో పాటు విచారణ త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. ఈ నేపథ్యంలో భూ సమస్యల పరిష్కారం కోసం ఏళ్లుగా కార్యాలయాల చుట్టూ తిరుగుతున్న రైతుల్లో ఆశలు చిగురిస్తున్నాయి. సర్కారు తాజా ఆదేశాలతో ఇక తమ ఇబ్బందులు తొలుగుతాయని భావిస్తున్నారు. పలు మాడ్యూల్స్‌లో మార్పులను చేసిన ప్రభుత్వం తహసీల్దార్, ఆర్డీవో స్థాయిల్లో కూడా పరిష్కరించే అవకాశం కల్పించింది. దీంతో పెండింగ్ దరఖాస్తులకు ఎట్టకేలకు మోక్షం కలుగనుందనే అభిప్రాయం బాధిత రైతుల నుంచి వ్యక్తమవుతోంది.

నెరవేరని స్పెషల్ డ్రైవ్ లక్ష్యం

ధరణిలో అపరిష్కృతంగా ఉన్న దరఖాస్తులు పరిష్కరించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఈ ఏడాది మార్చిలో స్పెషల్ డ్రైవ్ చేపట్టింది. పెండింగ్ దరఖాస్తులను పరిశీలించి జూన్ 4లోపు పూర్తిస్థాయిలో పరిష్కరించాలని యంత్రాంగాన్ని ఆదేశించింది. ఈ మేరకు అధికారులు మండలాల వారీగా వాటిని గుర్తించారు. వివరాలు సైతం ప్రభుత్వానికి పంపించారు. అయితే దరఖాస్తుల పరిశీలన ప్రక్రియ వేగవంతంగా సాగకపోవడం, పార్లమెంట్ ఎన్నికల కోడ్ రావడంతో అధికారులు ఎన్నికల ప్రక్రియలో నిమగ్నమయ్యారు. దీంతో దరఖాస్తుల పరిశీలన ప్రక్రియకు బ్రేక్ పడినట్టైంది. కొన్ని దరఖాస్తులను పరిష్కరించినప్పటికీ పూర్తిస్థాయిలో జరగకపోవడంతో స్పెషల్ డ్రైవ్ లక్ష్యం నెరవేరకుండాపోయింది. ప్రస్తుతం ఎన్నికల ప్రక్రియ ముగియడంతో ప్రభుత్వం మరోసారి ధరణి దరఖాస్తుల పరిష్కారంపై దృష్టి సారించింది.

యంత్రాంగం ప్రత్యేక దృష్టి

ప్రభుత్వ ఆదేశాలతో జిల్లా యంత్రాంగం ధరణి భూ సమస్యల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి సారించింది. ఇందులో భాగంగా జిల్లాలోని ఆర్డీవోలు, తహసీల్దార్లతో సమీక్షించిన కలెక్టర్లు వాటి పరిష్కారానికి అనుసరించాల్సిన కార్యాచరణపై దిశానిర్దేశం చేశారు. ధరణి మాడ్యూల్స్‌ను మూడు రోజుల్లోగా పరిష్కరించడంతోపాటు ప్రజావాణిలో అందిన భూ సమస్యల అర్జీలు సైతం పరి ష్కరించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

జిల్లాల వారీగా పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులు

జిల్లా	దరఖాస్తుల సంఖ్య
ఆదిలాబాద్	1,730
ఆసిఫాబాద్	3,417
మంచిర్యాల	7,911
నిర్మల్	3,999

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో మాడ్యూల్స్ వారీగా పెండింగ్‌లో ఉన్న ధరణి దరఖాస్తుల వివరాలు

మాడ్యూల్స్	ఆదిలాబాద్	కుమురంభీం	మంచిర్యాల	నిర్మల్
అప్లికేషన్ ఫర్ ఎస్ఆర్ఐపీపీబీ	00	00	02	03
కోర్టు కేసు ఇంటిమేషన్	49	53	437	63
కోర్టు కేసు పీపీబీ	43	57	46	49
డాటా కరెక్షన్	741	1481	3796	1704
జీపీఏ/ఎగ్జిక్యూటెడ్ జీపీఏ	29	27	106	60
గ్రీవెన్సెస్ ప్రొహిబిటెడ్ ప్రాపర్టీ	137	353	731	297
ఇష్యూ ఆఫ్ పీపీబీ/నాలా అవుట్‌సైడ్స్	01	09	388	00
ఖాతా మెర్జింగ్	03	06	10	16
ల్యాండ్ మ్యాటర్ గ్రీవెన్సెస్	216	723	735	451
నాలా విత్అవుట్ పీపీబీ	16	29	138	67
ఆర్గనైజేషన్ పీపీబీ	01	00	00	00
పెండింగ్ మ్యుటేషన్	93	150	402	397
సక్సేషన్	401	529	1118	892
అర్బన్ ల్యాండ్	00	00	02	00

పెండింగ్‌లో 17వేల దరఖాస్తులు

భూ సమస్యలకు సంబంధించి ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో వివిధ మాడ్యూల్స్ కింద మొత్తం 17,057 దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయి. ఇందులో అత్యధికంగా భూ విస్తీర్ణం, సర్వే నంబర్లలో తప్పులు, పేరు మార్పిడి, పట్టాల్లో తప్పులు దొర్లడం, డిజిటల్ సిగ్నిచర్ పెండింగ్ వంటి అంశాలకు సంబంధించినవే ఎక్కువగా ఉన్నాయి. వారసత్వం కింద పట్టా మార్పిడి వంటివి కూడా అత్యధికంగానే ఉన్నాయి. అలాగే నిషేధిత భూముల వ్యవహారాలకు సంబంధించిన దరఖాస్తులతో పాటు ఇతరత్రా సమస్యలతో కూడిన దరఖాస్తులు భారీగా పెండింగ్‌లో ఉన్నాయి. జిల్లాల వారీగా పరిశీలిస్తే తూర్పు ప్రాంతంలోని మంచిర్యాల జిల్లాలో దరఖాస్తులు అత్యధికంగా పెండింగ్‌లో ఉండగా.. అత్యల్పంగా ఆదిలాబాద్‌లో ఉన్నాయి.

తల్లి కాటికి.. తండ్రి కటకటాలకు..!

- శుభకార్యం జరగాల్సిన ఇంట్లో చావుడప్పు
- భర్త వేధింపులు భరించలేక మహిళ ఆత్మహత్య
- రెండు రోజుల్లో కూతురి శారీ ఫంక్షన్..
- అంతలోనే విషాదం

మంచిర్యాలక్రైం: శుభకార్యం జరగాల్సిన ఇంట్లో తల్లి తొందరపాటు నిర్ణయం విషాదం మిగిల్చింది. రెండు రోజుల్లో కూతురి నూతన వస్త్రాలంకరణ కోసం అలంకరణ వస్తువులు, ఇతర సామగ్రి కొనుగోలు చేసింది. ఫంక్షన్ నిర్వహణ విషయమై భార్యభర్తల మధ్య జరిగిన గొడవ చివరకు ఆ ఇంటి ఇల్లాలిని బలితీసుకుంది. తల్లి కాటికి వెళ్లగా, తండ్రి కటకటాలపాలయ్యాడు. దీంతో రెండు రోజుల్లో శుభకార్యం జరగాల్సిన ఇంట్లో విషాదం నెలకొంది. .

13 ఏళ్లుగా వేధింపులు..

ఎస్సై మహేందర్, మృతురాలి కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం జిల్లా కేంద్రంలోని హమాలీవాడకు చెందిన బుర్రి రాజమోహన్–సుగుణ కూతురు స్నేహశీల(36) మందమర్రికి చెందిన మహేశ్‌ను ప్రేమించి పెళ్లి చేసుకుంది. ఇద్దరు కూతుళ్లు ఉన్నారు. మహేశ్ ఎలాంటి పని చేయకుండా జులాయిగా తిరిగేవాడు. దీంతో పెళ్లయిన ఏడాది నుంచే కుటుంబంలో గొడవలు మొదలయ్యాయి. 13 ఏళ్లుగా భర్త వేధింపులు భరించిన స్నేహశీల కూతురి శారీ ఫంక్షన్ విషయంలో భార్య భర్తల మధ్య గొడవ జరిగింది. దీంతో మనస్తాపం చెందిన స్నేహశీల ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుంది.

ఉపాధ్యాయురాలిగా..

స్నేహశీల పీజీ, బీఈడీ చదివింది. కుటుంబ పోషణకు ప్రైవేట్ పాఠశాలల్లో ఉపాధ్యాయురాలిగా పనిచేస్తూ ఇద్దరు ఆడపిల్లలను, భర్తను పోషిస్తోంది. ఇటీవలే ప్రిన్సిపాల్‌గా పదోన్నతి సాధించింది. దీంతో మంచిర్యాలలోని హమాలీవాడలోని ఓ ఇంట్లో కుటుంబ సభ్యులతో కలిసి అద్దెకు ఉంటుంది. మహేశ్ నిత్యం మద్య తాగివచ్చి భార్యతో గొడవ పడేవాడు. మద్యానికి, పేకాటకు డబ్బులు కావాలని డిమాండ్ చేసేవాడు. దీంతో స్నేహశీల తన ఏటీఎం కార్డు, బ్యాంకు పాస్ బుక్ భర్తకే అప్పగించింది. అయినా వేధింపులు ఆగలేదు.



స్నేహశీల(ఫైల్)

రెండు రోజుల్లో శారీ ఫంక్షన్..

ఇక మహేశ్–స్నేహశీల దంపతుల పెద్ద కూతురు మనస్వికి రెండు రోజుల్లో శారీ ఫంక్షన్ చేసేందుకు స్నేహశీల తాను పనిచేస్తున్న స్కూల్ యాజమాన్యం వద్ద నెలసరి వేతనంతోపాటు మరి కొంత డబ్బు అడ్వాన్స్ రూపంలో తీసుకుంది. ఫంక్షన్ చేసేందుకు ఏర్పాట్లు చేస్తోంది. ఈ క్రమంలో శనివారం రాత్రి మహేశ్ మద్యం సేవించి ఇంటికి వచ్చి కూతురు ఫంక్షన్‌కు డబ్బులు ఎక్కడి నుంచి వచ్చాయని స్నేహశీలతో గొడవ పడ్డాడు. తనకూ డబ్బులు కావాలని విచక్షణా రహితంగా కొట్టాడు. దీంతో మనస్తాపం చెందిన స్నేహశీల ఇంట్లో ఫ్యాన్‌కు ఉరేసుకుంది. కుటుంబ సభ్యులు కాసేపటి తర్వాత వెళ్లి చూడగా ఉరేసుకుని కనిపించింది. దీంతో కిందకు దింపి ఆస్పత్రికి తరలిస్తుండగా మృతిచెందింది.

భర్త వేధింపులే కారణమని..

స్నేహశీల మృతికి భర్త మహేశ్ కారణమని ఆమె తల్లి సుగుణ, తమ్ముడు రాఘవ ఆరోపించారు. మహేశ్‌పై చట్టపరంగా చర్యలు తీసుకోవాలని పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈమేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై మహేందర్ తెలిపారు. మహేశ్‌ను కూడా అదుపులోకి తీసుకున్నట్లు తెలిసింది. స్నేహశీల మృతి వార్త తెలుసుకున్న ఆమె పనిచేసే పాఠశాల ఏజీఎం రాజు ఆస్పత్రికి వచ్చి కుటుంబ సభ్యులను ఓదార్చారు. కూతుళ్లకు అండగా ఉంటామని, అన్నివిధాలా ఆదుకుంటానని తెలిపారు.

వైద్యుల నిర్లక్ష్యం... బాలింతకు కష్టం..!

- నడుము నుంచి కాలికి వెళ్లే నరం కట్
- వారం రోజులుగా బెడ్‌కే పరిమితం

మంచిర్యాలటౌన్: మంచిర్యాల పట్టణంలోని మాతాశిశు ఆరోగ్య కేంద్రం వైద్యుల నిర్లక్ష్యంతో ఓ బాలింత మంచం నుంచి లేవలేని పరిస్థితి నెలకొంది. బాధిత మహిళ, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. నెన్నెల మండలం కర్జి గ్రామానికి చెందిన గంగకు పాతబెల్లంపల్లికి చెందిన ఆవునూరి శేఖర్‌తో వివాహమైంది. మొదటి కాన్పు కోసం ఈ నెల 9న మంచిర్యాలలోని ఎంసీహెచ్‌కు తీసుకువచ్చారు. 10వ తేదీన ఉదయం ఆపరేషన్ చేయగా బాబుకు జన్మనిచ్చింది. బాబు గుండెకు రంధ్రం ఉందని వైద్యులు తెలపడంతో చికిత్స చేస్తున్నారు. దీంతో తల్లి, బిడ్డ ఆస్పత్రిలోనే ఉన్నారు.


స్పర్శ కోల్పోవడంతో...

ఇక శనివారం గంగ నడుము నుంచి కాలు వరకు స్పర్శ కోల్పోయింది. దీంతో కుటుంబ సభ్యులు వైద్యులకు విషయం చెప్పారు. దీంతో వైద్యులు బయట స్కానింగ్‌కు తీసుకెళ్లాలని చెప్పడంతో ఆదివారం స్కానింగ్ చేయించారు. నడుము నుంచి కాలుకు వెళ్లే నరం ఆపరేషన్ చేసే సమయంలో కట్ కావడంతో స్పర్శను కోల్పోయిందని తెలిపారు. దీంతో కుటుంబ సభ్యులు ఎంసీహెచ్‌కు వచ్చి వైద్యులను నిలదీశారు. తమ తప్పేమీ లేదంటూనే, గాంధీ ఆసుపత్రికి తీసుకెళ్లాలని సూచించారు. వైద్యులు నిర్లక్ష్యంగా వ్యవహరించడంపై ఆస్పత్రి ఎదుట ఆందోళన చేశారు. సమాచారం అందుకున్న పోలీసులు ఆస్పత్రికి చేరుకున్నారు. ఆందోళ విరమించాలని నచ్చజెప్పినా వినలేదు. ఆస్పత్రి డాక్టర్ వేదవ్యాస్ బాధితులతో మాట్లాడారు. మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌లోని గాంధీ ఆస్పత్రికి వెళ్లేందుకు ప్రత్యేక అంబులెన్స్ ఏర్పాటు చేయడంతో ఆందోళన విరమించారు.



చికిత్స పొందుతున్న బాలింత గంగ

వాసవీ క్లబ్ రీజియన్ స్థాయి క్రీడా పోటీలు



పోటీల్లో పాల్గొన్న క్రీడాకారులు

పాతమంచిర్యాల: జిల్లా కేంద్రంలోని హైటెక్ సిటీ క్లబ్‌లో వాసవీ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించిన చదరంగం, క్యారమ్స్, షటిల్ బ్యాడ్మింటన్ పోటీలు ఆదివారం నిర్వహించారు. ప్రారంభోత్సవానికి ముఖ్య అతిథిగా మున్సిపల్ చైర్మన్ డాక్టర్ రావుల ఉప్పలయ్య హాజరై మాట్లాడారు. వాసవీ క్లబ్ పేదలకు అండగా నిలుస్తూ వివిధ సేవా కార్యక్రమాలు నిర్వహించడంతోపాటు క్రీడా పోటీలు నిర్వహించడాన్ని అభినందించారు. క్రీడాకారులను ప్రోత్సహించడానికి ఇది మంచి వేదిక అన్నారు. క్రీడల్లో ప్రతిభ చూపిన వారికి బహుమతులు అందజేశారు. పోటీలలో పాల్గొన్న క్రీడాకారులకు ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో వాసవీ క్లబ్ అంతర్జాతీయ అడ్మినిస్ట్రేటివ్ వైస్ ప్రెసిడెంట్ సిరిపురం రాజేశ్, సీనియర్ ఉపాధ్యక్షులు కటుకం హరీశ్, అంతర్జాతీయ ప్రోగ్రాం కోఆర్డినేటర్లు ముఖేష్, వెంకటేశ్, జిల్లా క్యాబినెట్ కోశాధికారి కేశెట్టి వంశీకృష్ణ, రీజినల్ చైర్‌పర్సన్ కాచం సతీశ్, జిల్లా అధికారులు ఎస్.లావణ్య, పుత్తూరు రమేశ్, రీజియన్ సెక్రెటరీ ధనలక్ష్మి, జోన్ చైర్మన్ ఎస్.ప్రవీణ్, వనిత క్లబ్ అధ్యక్షురాలు స్వప్న, యూత్ క్లబ్ అధ్యక్షుడు టి సాయివర్ధన్, టీచర్ క్లబ్ అధ్యక్షురాలు నార్ల సరిత, క్యాతన్‌పల్లి క్లబ్ అధ్యక్షురాలు మేడి లావణ్య వాసవీ క్లబ్ సభ్యులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వాసవీ క్లబ్ సభ్యులు మున్సిపల్ చైర్మన్‌ను సన్మానించారు.

క్లుప్తంగా

రైల్లో నుంచి జారిపడి యువకుడి మృతి


నితీశ్‌కుమార్ మృతదేహం

తాండూర్: రైల్లో నుంచి ప్రమాదవశాత్తు జారిపడి ఓ యువకుడు మృతి చెందిన ఘటన తాండూర్ మండలంలో ఆదివారం జరిగింది. బెల్లంపల్లి జీఆర్పీ హెడ్ కానిస్టేబుల్ సురేశ్‌గౌడ్ తెలిపిన వివరాల ప్రకారం.. బిహార్ రాష్ట్రం సెమ్రు గ్రామానికి చెందిన నితీశ్‌కుమార్ (19) చెన్నైలోని ఓ కంపెనీలో పనిచేస్తూ మూడు నెలలుగా అక్కడే ఉంటున్నాడు. శనివారం సంఘమిత్ర రైలులో చెన్నై నుంచి స్వగ్రామానికి బయల్దేరాడు. ఆదివారం ఉదయం మండలంలోని రేపల్లెవాడ జిన్నింగ్ మిల్ సమీపంలో రైల్లోనుంచి జారిపడ్డాడు. దీంతో తోటి ప్రయాణికులు చైన్ లాగి వెళ్లి చూసేసరికి నితీశ్‌కుమార్ మృతి చెందాడు. ఈమేరకు బెల్లంపల్లి రైల్వే పోలీసులకు సమాచారం అందించగా వారు మృతదేహాన్ని ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సురేశ్‌గౌడ్ తెలిపారు.

బైక్ అదుపు తప్పి ఒకరు మృతి


ఊశాలు మృతదేహం

జన్నారం: బైక్ అదుపు తప్పి కింద పడి ఒకరు మృతి చెందిన ఘటన జన్నారం మండలం చింతగూడ సమీపంలో ఆదివారం జరిగింది. రెండో ఎస్సై మృత్యుంజయసర్కార్ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని మహమ్మదాబాద్ గ్రామానికి చెందిన సోమారపు ఊశాలు(45) బైక్‌పై చింతగూడ లక్ష్మీదేవి దర్శనానికి బయల్దేరాడు. చింతగూడ గ్రామ సమీపంలోకి రాగానే బైక్ అదుపుతప్పి కిందపడ్డాడు. అతని తలకు తీవ్ర గాయం కావడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. ఊశాలు భార్య నాగలక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

రెండుసార్లు ఆత్మహత్యాయత్నం.. మూడోసారి మృతి


అంజన్న (ఫైల్)

మంచిర్యాలక్రైం: జిల్లా కేంద్రంలోని ఎన్టీఆర్ నగర్‌కు చెందిన ఎగ్గన అంజన్న(45) ఆదివారం ఉదయం రెండుసార్లు ఆత్మహత్యాయత్నం చేయగా స్థానికులు అడ్డుకున్నారు. మధ్యాహ్నం ఇంట్లో ఎవరూ లేని సమయంలో మూడోసారి ఫ్యాన్‌కు చీరతో ఉరేసుకుని తనువు చాలించాడు. కుటుంబ సభ్యుల, ఎస్సై ప్రశాంత్ తెలిపిన వివరాల ప్రకారం.. అంజన్న కూలీ పని చేసుకుంటూ జీవనం సాగించేవాడు. కొంత కాలంగా మద్యానికి బానిసయ్యాడు. ఈ క్రమంలో పెద్ద కూతురు వివాహం చేసి అప్పులపాలయ్యాడు. పైగా కూతురు ఇంటిదగ్గర ఉండడంతో మనస్తాపం చెందాడు. అప్పుల విషయమై తరచూ ఇంట్లో గొడవలు జరగడంతో ఉదయం కాలనీలోని చెట్టుకు ఉరేసుకునేందుకు యత్నించాడు. స్థానికులు అడ్డుకుని ఇంటికి పంపించారు. కాసేపటికి రైలు పట్టాలపై పడి ఆత్మహత్య చేసుకునేందుకు వెళ్తుండగా స్థానికులు అడ్డుకుని ఇంటికి పంపించారు. ఎలాగైన చనిపోవాలని నిర్ణయించుకున్న అంజన్న మద్యం సేవించి ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు ఉరేసుకున్నాడు. అంజన్నకు భార్య వనిత, ఇద్దరు కూతుళ్లు ఉన్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

లెక్క తేలుతోంది!


వన్యప్రాణుల మలం పరిశీలిస్తున్న ఎన్జీవో సభ్యులు

- కొనసాగుతున్న వన్యప్రాణుల సర్వే
- మరో వారంలో పూర్తి

జన్నారం: కవ్వాల్ టైగర్‌జోన్‌లో నాలుగో విడత వన్యప్రాణుల గణన మొదలైంది. అడవిలో తిరిగే పులులు, చిరుత పులులతోపాటు మాంసహార, శాకాహార వన్యప్రాణులను లెక్కించేందుకు చేపట్టిన సర్వే చివరి దశకు చేరింది. నేషనల్ టైగర్ కన్జర్వేషన్ ఆఫ్ అథారిటీ(ఎన్టీసీఏ) గైడ్‌లైన్స్ ప్రకారం పులులు, చిరుతలతోపాటుగా అడవిలో ఆవాసం ఏర్పాటు చేసుకున్న వివిధ వన్యప్రాణుల వివరాలు సేకరిస్తున్నారు. ఎఫ్‌డీపీటీ శాంతారాం, జిల్లా అటవీ అధికారి శివ్‌ఆశిష్‌సింగ్ ఆదేశాల మేరకు ఎస్టీసీహెచ్, ఎన్జీవో సభ్యుల ఆధ్వర్యంలో కవ్వాల్ టైగర్‌జోని అన్ని డివిజన్లలో వేర్వేరుగా గణన కొనసాగుతోంది. ఏప్రిల్ 22న ప్రారంభించిన గణన ప్రస్తుతం చివరి దశకు వచ్చింది.

రెండు రకాలుగా గణన..

కవ్వాల్ టైగర్‌జోన్‌లోని కోర్, బఫర్ ప్రాంతాలలో మాంసాహార, శాకాహార జంతువుల ఉనికి, సంఖ్యతోపాటుగా వాటి కదలికలను తెలుసుకోవడానికి వన్యప్రాణుల సర్వే(అక్యుపెన్సీ సర్వే) చేపట్టారు. ఈ సర్వే ప్రత్యక్ష, పరోక్ష పద్ధతుల్లో చేస్తున్నారు. కెమెరాలలో, ప్రత్యేక్షంగా చూసిన జంతువుల ఆధారంగా ప్రత్యక్ష పద్ధతిగా, మలం, వెంట్రుకలు, అడుగులు, గోర్లు, చెట్లను గీరిన విధానం ద్వారా పరోక్ష పద్ధతిన వన్యప్రాణులను లెక్కిస్తున్నారు. ఈ సర్వేలో హైదరాబాద్ టైగర్ కన్జర్వేషన్ సొసైటీ సభ్యులతోపాటుగా ఎన్జీవో సభ్యులు, రేంజ్ అధికారులు, డిప్యూటీ రేంజ్ అధికారులు, సెక్షన్, బీట్ అధికారులు పాల్గొంటున్నారు. ఈ సర్వే ద్వారా కవ్వాల్ టైగర్‌జోన్ మాంసాహార జంతువులకు ఎంత వరకు అనువైన ప్రాంతం అనే అంశం కూడా తెలుస్తుందని అధికారులు భావిస్తున్నారు.

95 శాతం పూర్తి..

ఇప్పటి వరకు ఆసిఫాబాద్, మంచిర్యాల, ఖానాపూర్, ఉట్నూర్ అటవీ డివిజన్ల పరిధిలోని కోర్, బఫర్ ఏరియాల్లో సర్వే పూర్తి చేశారు. జన్నారం అటవీ డివిజన్‌లోని తాళ్లపేట, జన్నారం, ఇందన్‌పల్లి, బీర్సాయిపేట, ఉడుంపూర్, కడెం రేంజ్‌ల కోర్ ప్రాంతాలలో సర్వే కొనసాగుతోంది. తాళ్లపేట, జన్నారం, ఇందన్‌పల్లి రేంజ్‌లలో ప్రస్తుతం ఎన్జీవో సభ్యులు పరోక్ష పద్ధతిలో వన్యప్రాణులను లెక్కిస్తున్నారు. జన్నారం అటవీ డివిజన్‌లో పులి మినహా చిరుత పులి, అడవి కుక్క, ఎలుగుబంటి లాంటి మాంసాహార జంతువుల పాదముద్రలు, మల, మూత్రాల సంకేతాలను గుర్తించారు. చెన్నూరు, ఆదిలాబాద్ అటవీ డివిజన్లలో పులి అడుగులు గుర్తించినట్లు అధికారులు తెలిపారు.

వారంలో పూర్తి వివరాలు



రెండు నెలలుగా వివిధ ప్రాంతాల్లో మాంసాహార జంతువులు, శాకాహార జంతువుల సర్వే జరుగుతోంది. ఎన్జీవో సభ్యులతోపాటుగా మా సిబ్బంది కూడా సర్వేలో పాల్గొంటున్నారు. మేము కూడా నేరుగా వన్యప్రాణులను గుర్తించాం. వారం రోజుల్లో సర్వే పూర్తిచేసి వివరాలు వెల్లడిస్తాం. నివేదికలను ఉన్నతాధికారులకు పంపిస్తాం.

– సుష్మారావు, ఫారెస్ట్ రేంజ్ అధికారి

విరివిగా శాకాహార జంతువులు..

జన్నారం అటవీ డివిజన్‌లోని జన్నారం, తాళ్లపేట రేంజ్‌లో నిర్వహించిన సర్వేలో విరివిగా శాకాహార జంతువుల ఆనవాళ్లు గుర్తించామని రేంజ్ అధికారి సుష్మారావు తెలిపారు. నేరుగా కొన్నిరకాల జంతువులు కనిపించగా, కొన్ని జంతువులను పాదముద్రలు, వెంట్రుకలు, మలం, చెట్లకు అంటిన శరీర ఆనవాళ్ల ఆధారంగా గుర్తించినట్లు వివరించారు. జన్నారం అటవీ డివిజన్‌లో అడవి దున్నలు, మనుబోతులు, దుప్పి, అడవి పంది, చుక్కల జింక, గడ్డి జింక, కొండ గొర్రెలు, సాంబార్లను గుర్తించినట్లు తెలిపారు. మనుబోతులు, అడవి పందులు అడవి మొత్తం ఉన్నాయని పేర్కొన్నారు. కొండప్రాంతాల్లో సాంబర్ల సంఖ్య, దట్టమైన అడవుల్లో అడవి దున్నల సంఖ్య ఎక్కువగా ఉన్నట్లు వెల్లడించారు. చుక్కల దుప్పులు మైదాన ప్రాంతాల్లో ఎక్కువగా ఉన్నట్లు తెలిపారు. గడ్డి జింక, కొండ గొర్రెల సంఖ్య తక్కువ సంఖ్యలో ఉన్నట్లు సర్వేలో తెలిసిందని చెప్పారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం


ఉపాధ్యాయులతో పూర్వ విద్యార్థులు

మంచిర్యాలఅర్బన్: పాత మంచిర్యాల హైస్కూల్‌కు చెందిన పూర్వ విద్యార్థుల సమ్మేళనం జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేటు ఫంక్షన్ హాల్‌లో ఆదివారం జరిగింది. 1999–2000 సంవత్సరం పదో తరగతికి చెందిన విద్యార్థులు రెండు దశాబ్దాల తర్వాత కలుసుకున్నారు. పాఠశాలలోని జ్ఞాపకాలను గుర్తుచేసుకున్నారు. యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. సెల్ఫీలు దిగారు. ఉపాధ్యాయులను గౌరవంగా సన్మానించారు. కార్యక్రమంలో నిర్వాహకులు నర్సయ్య, ఆంబ్రోస్ తదితరులు పాల్గొన్నారు.

జైపూర్ ప్రభుత్వ పాఠశాలలో..


జైపూర్ హైస్కూల్ 2003-04 పదో తరగతి బ్యాచ్ విద్యార్థులతో ఉపాధ్యాయ బృందం

జైపూర్: మండలం కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 2003–04 పదో తరగతి బ్యాచ్ విద్యార్థుల సమ్మేళనం ఆదివారం నిర్వహించారు. ఉద్యోగ రీత్యా వివిధ ప్రాంతాల్లో స్థిరపడిన పూర్వవిద్యార్థులంతా 20 ఏళ్ల తర్వాత కలుసుకున్నారు. పాఠశాలలో చదువుకున్న సమయంలో జ్ఞాపకాలను పంచుకున్నారు. ఈ సందర్భంగా నాటి ప్రధానోపాధ్యాయులు కన్నయ్య, ఉపాధ్యాయులు మాట్లాడుతూ పూర్వవిద్యార్థులు అందరూ ఒక చోట కలుసుకోవడం ఆనందంగా ఉందన్నారు. అనంతరం గురువులను విద్యార్థులు సత్కరించి జ్ఞాపికలు బహూకరించారు.

పిచ్చికుక్క స్వైర విహారం

- ఎనిమిది మందిపై దాడి


పిచ్చికుక్క దాడిలో తీవ్ర గాయాలైన మహేశ్


గాయాలు చూపుతున్న తలండి భీమయ్య


అంబులెన్స్‌లో కోల మహేశ్, పొన్నం సాత్విక్

వేమనపల్లి: మండల కేంద్రంతోపాటు పరిసర గ్రామాల్లో పిచ్చికుక్క స్వైరవిహారం చేస్తోంది. శనివారం అర్ధరాత్రి నుంచి 24 గంటల్లో 8 మందితోపాటు పశువులపై దాడిచేసి గాయపర్చింది. మండల కేంద్రానికి చెందిన గాండ్ల మహేశ్ అర్ధరాత్రి ప్రాణహిత నదిలో చేపలు పట్టేందుకు వెళ్లగా అతడిపై దాడి చేసి తీవ్రంగా గాయపర్చింది. ఎల్లల నగేశ్ నీల్వాయి ప్రాజెక్టుకు చేపలు పట్టేందుకు అర్ధరాత్రి బైక్‌పై వెళ్తుండగా పోశన్న రైస్‌మిల్లు వద్ద డీ చేసింది. ఆర్ఎంపీ వైద్యుడు పున్నం సత్యనారాయణ కుమారుడు సాత్విక్‌తో కలిసి బైక్‌పై వెళ్తుండగా వెంబడించి గాయపర్చింది. అక్కడి నుంచి ఎస్సీ కాలనీ వైపునకు వెళ్లిన పిచ్చికుక్క బైక్‌పై ఉన్న సుంపుటం గ్రామానికి చెందిన కుబిడె మధుపై దాడి చేసింది. రాత్రంతా గ్రామంలో స్వైరవిహారం చేసి పశువులను గాయపర్చినట్లు గ్రామస్తులు తెలుపుతున్నారు. ఆదివారం ఉదయం గుమ్ముల సంతోష్‌పై దాడి చేయగా దస్నాపూర్ వైపుకు వెళ్లిన పిచ్చికుక్క కోల మహేశ్‌గౌడ్, కొత్తపల్లి గ్రామం వద్ద బైక్‌పై వెళ్తున్న మంగెనపల్లి గ్రామానికి చెందిన తలండి భీమయ్యపై దాడిచేసి గాయపర్చింది. బాధితులంతా వేమనపల్లి పీహెచ్‌సీకి వెళ్లి ఆర్ఎస్‌వీ టీకా వేయించుకున్నారు. తీవ్రంగా గాయపడిన కోల మహేశ్, పున్నం సాత్విక్‌ను 108లో చెన్నూర్ ఆస్పత్రికి తరలించారు.

చుక్కల దుప్పిని రక్షించిన గ్రామస్తులు


చుక్కల దుప్పి వద్ద అధికారులు, గ్రామస్తులు

జైపూర్: మండలంలోని ముదిగుంట గ్రామంవైపునకు ఆదివారం దారితప్పి వచ్చిన చుక్కల దుప్పిని కుక్కలు తరుముతుండగా గ్రామస్తులు రక్షించారు. అటవీశాఖ అధికారులకు అప్పగించారు. గ్రామ శివారులోని అటవీ అభివృద్ధి సంస్థకు చెందిన నీలగిరి ప్లాంటేషన్‌లోకి చుక్కల దుప్పి వచ్చింది. దానిని చూసిన కుక్కలు వెంటపడగా వాటి నుంచి తప్పించుకునే క్రమంలో పక్కనే ఉన్న ముదిగుంట వైపునకు వచ్చింది. గమనించిన గ్రామస్తులు కుక్కలను తరిమివేసి ఆ దుప్పిని రక్షించారు. నీళ్లు తాగించి స్థానిక ప్లాంటేషన్ వాచర్ శంకర్‌కు సమాచారం అందించారు. వాచర్ ద్వారా సమాచారం తెలుసుకున్న అటవీ అభివృద్ధి సంస్థ రేంజ్‌ప్లాంటేషన్ మేనేజర్ గోగు సురేశ్‌కుమార్ సంఘటన స్థలానికి చేరుకుని దుప్పిని స్వాధీనం చేసుకున్నారు. కుక్కల దాడి నుంచి తప్పించుకునే క్రమంలో దుప్పికి గాయాలు కావడంతో జైపూర్ పశువుల ఆస్పత్రికి తరలించి చికిత్స అందించారు. తర్వాత అడవిలో విడిచిపెట్టారు.

పిడుగుపాటుకు 15 గొర్రెలు మృతి


గొర్రెల కళేబరాల వద్ద రైతు

వేమనపల్లి: మండలంలోని సూరారం, లక్ష్మీపూర్ గ్రామాల శివారులో ఆదివారం సాయంత్రం పిడుగు పడి 15 గొర్రెలు మృతి చెందాయి. నాయకునిపేట గ్రామపంచాయతీ కుర్మగూడెంకు చెందిన మేకల రాజయ్యకు చెందిన గొర్రెలను మేత కోసం గొల్లకుర్మలు సూరారం గ్రామ శివారుకు తీసుకెళ్లారు. వర్షం పడుతుండటంతో మందను ఒక దగ్గరికి జమ చేస్తుండగానే పిడుగు పడింది. దీంతో సుమారు రూ.లక్ష నష్టం వాటిల్లిందని బాధితుడు తెలిపాడు.

తండ్రీకొడుకుల అదృశ్యం

చింతలమానెపల్లి: మండలంలోని గూడెం గ్రామానికి చెందిన తండ్రీకొడుకులు ఇద్దరు అదృశ్యం కాగా.. కేసు నమోదు చేసినట్లు ఎస్సై నరేశ్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. గూడెం గ్రామానికి చెందిన కుకుడ్‌కార్ నందు(28), అతని కుమారుడు విష్ణు(5) ఈ నెల 11న ఇంటి నుంచి బయటికి వెళ్లారు. తిరిగి రాకపోవడంతో కుటుంబ సభ్యులు ఆచూకీ కోసం ప్రయత్నించినా ఎలాంటి సమాచారం దొరకలేదు. నందు తండ్రి కుకుడ్‌కార్ హన్మంతు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

బైక్ పైనుంచి పడి మహిళ మృతి

బెజ్జూర్(సిర్పూర్): బైక్ పైనుంచి పడి మహిళా మృతి చెందిన ఘటన బెజ్జూర్ మండలం పోతపల్లి సమీపంలో ఆదివారం చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. చింతలమానెపల్లి మండలం కర్జెల్లికి చెందిన భూస భూమక్క(60) బెజ్జూర్ మండలం చిన్నసిద్దాపూర్‌లోని కుమార్తె కుదురుపాక అంకుబాయి ఇంటికి బయలుదేరింది. వరుసకు మనుమడైన కుదురుపాక మహేశ్ బైక్‌పై వెళ్తుండగా.. బైక్ అదుపు తప్పి కింద పడిపోయింది. తీవ్రంగా గాయపడిన భూమక్క అక్కడిక్కడే మృతి చెందింది. మృతురాలి భర్త పెంటయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

త్యాగానికి ప్రతీక బక్రీద్

- నేడు ఈదుల్‌జుహా ప్రత్యేక నమాజ్


నెన్నెల ఈద్గాలో ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు(ఫైల్)

నెన్నెల: మానవాళిని సన్మార్గంలో నడిపించేందుకు అల్లా పంపిన ప్రవక్తల్లో ఒకరైన హజరత్ ఇబ్రహీం త్యాగ నిరతికి ప్రతీకగా జరుపుకునే పండుగ బక్రీద్. దీనినే ఈదుల్‌జుహా అని కూడా అంటారు. ఇస్లాం క్యాలెండర్‌లోని బక్రీద్ మాసంలో 11వ రోజున ఈ పండుగను జరుపుకోవడం ఆనవాయితీ. ఇస్లాం మానవాళికి నిర్దేశించిన విధివిధానాల్లో ఐదో విధి అయిన మక్కా యాత్ర చేయడం, జంతువులను బలిచ్చి మాంసాన్ని పేదలకు పంపిణీ చేయడం, రెండు రకాత్‌లుగా నమాజ్ చేయడం ఈ పండుగ ప్రత్యేకత. సోమవారం బక్రీద్ పండుగ నేపథ్యంలో ప్రత్యేక కథనం.

సమాజంలోని రుగ్మతల నుంచి జనవాళిని జాగృతపరుస్తూ సన్మార్గంలో నడిపించేందుకు అల్లా భూ మండలానికి 80 వేల మంది ప్రవక్తలను పంపినట్లు ఖురాన్ చెబుతోంది. వారిలో ప్రవక్త హజరత్ ఇబ్రహీం అల్లాపై విశ్వాసంతో సన్మార్గంలో జీవనం గడపాలని మానవాళికి బోధిస్తున్న ప్రవక్తల్లోని విశ్వాసాన్ని కూడా గ్రహించేందుకు అల్లా అనేక విధాలుగా పరీక్షించేవారు. ఈ క్రమంలో ప్రవక్త ఇబ్రహీం అనేక పరీక్షల్లో తన విశ్వాసాన్ని నిరూపించినట్లు పవిత్ర ఖురాన్ చెబుతుంది. ఈ క్రమంలోనే హజరత్ ఇబ్రహీం, ఆయన సతీమణి హాజీరాలకు వారి వృద్ధాప్యంలో అల్లా వారికి సంతాన ప్రాప్తి కలిగించారు. లేకలేక జన్మించిన తన కుమారుడు ఇస్మాయిల్‌ను వృద్ధ దంపతులు అల్లారుముద్దుగా పెంచుకుంటున్న తరుణంలో ఒకరోజు రాత్రి ఇబ్రహీం తన కుమారుడు ఇస్మాయిల్‌ను అల్లా పేర బలిదానం చేస్తున్నట్లు కలగంటారు. దీంతో అల్లా తన కుమారుడిని బలిదానం కోరుకుంటున్నారని గ్రహించిన ఇబ్రహీం తన కుమారుడు ఇస్మాయిల్‌ను బలిదానం (ఖుర్బానీ) ఇచ్చేందుకు సిద్ధపడతాడు. తండ్రి అంతరంగాన్ని గమనించిన కుమారుడు ఇస్మాయిల్ కూడా అల్లా మార్గంలో బలి అయ్యేందుకు సిద్ధపడుతాడు. బలి ఇచ్చే సమయంలో పుత్ర వాత్సల్యం అడ్డువస్తే తనను బలి ఇవ్వకుండా తన తండ్రి వెనుకడుగు వేస్తే అల్లా దృష్టిలో విశ్వాస ఘాతకుడిగా మిగలకుండా కళ్లకు గంతలతో తనను బలి ఇవ్వమంటూ తండ్రికి సూచిస్తాడు. ఆ మేరకు అల్లా నామస్మరణతో తన కుమారుడిని బలి ఇచ్చేందుకు గొంతుపై కత్తి పెట్టిన క్షణంలో త్యాగనిరతికి మెచ్చిన అల్లా ఆఖరు క్షణంలో అల్లా ఇస్మాయిల్‌ను తప్పించి అదే స్థానంలో ఒక దుంబా(పొట్టేలు)ను ప్రత్యక్ష పరుస్తారు. దీంతో పొట్టేలు గొంతు తెగి అల్లా మార్గంలో అది ఖుర్బాన్ అవుతుంది.

మాంసం పంపిణీ..

వృద్ధాప్యంలో లేకలేక కలిగిన సంతానాన్ని బలిచ్చేందుకు సిద్ధపడిన ఇబ్రహీం త్యాగనిరతిని మెచ్చిన అల్లా ఆ రోజు నుంచి బక్రీద్ పండుగ జరుపుకుంటూ జంతుబలి ఇవ్వాలని ఈ విధానాన్ని ప్రళయం వరకు కొనసాగించాలని నిర్దేశించినట్లు ఇస్లాం చెబుతోంది. ఈ మేరకు ముస్లింలు బక్రీద్ రోజున పెద్ద ఎత్తున జంతువులను బలిచ్చి మాంసాన్ని కుటుంబ సభ్యులకు, బంధు మిత్రులకు, పేదలకు సమభాగాలుగా పంపిణీ చేస్తారు.

ప్రధాన లక్ష్యం..

దాన ధర్మాలకు, పేదలను ఆదుకునేందుకు అత్యంత ప్రాధాన్యత ఇస్తున్న ఇస్లాం బక్రీద్ సందర్భంగా ఖుర్బానీ ఇచ్చే జంతువుల మాంసంలో మూడో భాగాన్ని పేదలకు పంపిణీ చేయాలని నిర్దేశించింది. ధనికులతోపాటు పేదలకు కూడా పండుగపూట మాంసాహారం భుజించాలని ఇస్లాం నిర్దేశించిన మేరకు ఖుర్బానీ ఇచ్చే ప్రతీ ముస్లిం ఒకవంతు మాంసాన్ని పేదలకు పంపిణీ చేస్తారు. జంతు మాంసాన్ని మూడు భాగాలుగా చేసి ఒక భాగాన్ని పేదలకు, మరో భాగాన్ని బంధువులకు పంపిణీ చేస్తారు. మరో భాగాన్ని కుటుంబ సభ్యులు భుజిస్తారు.

ఈదుల్ జుహ నమాజ్..

పండుగ రోజుల్లో రెండు రకాత్‌లుగా నమాజ్ ఆచరిస్తారు. బక్రీద్ పండుగ సందర్భంగా ఉదయాన్నే ఈదుల్ జుహ నమాజ్‌ను ఈద్గాల్లో, మసీదుల్లో ఆచరిస్తారు. నమాజ్ ఆచరణకు పెద్ద సంఖ్యలో వచ్చే అవకాశం ఉండటంతో మసీదుల నిర్వహకులు తగు ఏర్పాట్లు చేస్తారు.

మక్కా యాత్ర..

ఇస్లాం విధి విధానాల్లో ఐదో విధానమైన హజ్(మక్కాయాత్ర) ఇదే రోజున మక్కాలో జరుగుతుంది. ప్రపంచ వ్యాప్తంగా లక్షలాది ముస్లింలు మక్కా మసీదులోని కాబా దర్శనం చేసుకుంటారు. 40 రోజుల హజ్ యాత్రలో భాగంగా మక్కా మదీనాల్లో నమాజ్ ఆచరిస్తూ సైతాన్‌కు రాళ్లు వేసే ప్రక్రియలో పాల్గొంటూ దైవారాధనలో గడుపుతారు.

జాతీయ సాహిత్య సమ్మేళనంలో రవితేజ


సమ్మేళనంలో కవిత్వం ఆలపిస్తున్న రవితేజ

జైపూర్: ఆంధ్రప్రదేశ్‌లోని శ్రీవేంకటేశ్వర విశ్వవిద్యాలయంలో అంతర్జాతీయ సాహిత్య సాంస్కృతిక సామాజిక సేవ సంస్థ శ్రీశ్రీ కళావేదిక, తెలుగుశాఖ వారి ఆధ్వర్యంలో జాతీయ శతాధిక సాహిత్య కవి సమ్మేళనం నిర్వహించారు. ఇందులో మంచిర్యాల జిల్లా జైపూర్ మండలం బెజ్జాల గ్రామానికి చెందిన మంతెన రవితేజ పాల్గొని ఓ సఖియా... నా ప్రియ సఖియా అంటూ తన కవిత్వాన్ని ఆలపించారు. అనంతరం సంస్థ ఆధ్వర్యంలో సన్మానించి ప్రశంసాపత్రంతోపాటు జ్ఞాపిక అందజేశారు. మంచిర్యాల జిల్లా నుంచి ఆహ్వానాన్ని అందుకుని సాహిత్య సమేళనంలో పాల్గొనే అవకాశంపొంది తన సాహిత్యాన్ని అందించి జ్ఞాపికను అందుకోవడంపై జిల్లా కవులు హర్షం వ్యక్తం చేశారు. రవితేజను అభినందించారు.

భూవివాదంలో ఇరువర్గాల మధ్య ఘర్షణ

బెజ్జూరు(సిర్పూర్): బెజ్జూర్ మండలం అంబగట్టు శివారులో ఆదివారం భూవివాదం ఘర్షణకు దారితీసింది. ఇరువర్గాల మధ్య గొడవల్లు, కర్రలతో ఘర్షణ జరిగింది. ఐదుగురు గాయపడ్డారు. సర్వే నం.71లోని భూమిలో పొర్తెటి జగదీష్, సుగుణాకర్, నైతం సకారాం, పోర్తెటి నానాజీ దున్నుకుంటుండగా బూర్గుగూడ గ్రామానికి చెందిన తలండి గణేశ్, మల్లేశ్, విమల, సరోజ అడ్డుకున్నారు. తమ భూమిని ఎందుకు దున్నుతున్నారని ప్రశ్నించారు. మాటమాట పెరిగి ఘర్షణకు దారితీసింది. బూర్గుగూడ చెందిన తలండి గణేశ్, మల్లేశ్, విమల, సరోజ, అంబగట్టుకు చెందిన పోర్తెటి నానాజీకి గాయాలయ్యాయి. మల్లేశ్, గణేశ్‌పై గొడ్డలితో దాడి చేయడంతో తీవ్రంగా గాయపడ్డారు. క్షతగాత్రులను బెజ్జూర్ ఆస్పత్రిలో ప్రాథమిక చికిత్స చేయించిన అనంతరం సిర్పూర్(టి) ఆస్పత్రికి తరలించారు. ఇరువురి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై విక్రమ్ తెలిపారు.

ఆరుగురిపై కేసు నమోదు

చింతలమానెపల్లి: మహిళను దుర్భాషలాడిన చింతలమానెపల్లి మండలం కోయపల్లి గ్రామానికి చెందిన ఆరుగురిపై ఆదివారం కేసు నమోదు చేసినట్లు ఎస్సై నరేశ్ తెలిపారు. కోయపల్లికి చెందిన గోలేటి కమలకు గూడెం శివారులోని 9 సర్వే నంబర్‌లో 8.21 ఎకరాల భూమి ఉంది. ఈ భూమిలోకి గ్రామానికి చెందిన గోలేటి సంజీవ్, గోలేటి మొండి, గోలేటి పోషయ్య, గోలేటి బొడ్డయ్య, గోలేటి శంకర్, గోలేటి రంగయ్య అక్రమంగా ప్రవేశించి గోలేటి కమలను దుర్భాషలాడుతూ చంపుతామని బెదిరించారు. కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

భూవివాదంపై డీఎస్పీ విచారణ

బెజ్జూర్(సిర్పూర్): బెజ్జూర్ మండలం మర్దిడి శివారులో భూవివాదంపై ఆదివారం డీఎస్పీ కరుణాకర్ విచారణ చేపట్టారు. మర్దిడి శివారులోని సర్వే నంబర్లు 167/2, 167/3, 167/4, 167/2(అ), 167/3(అ), 167/4(అ)లో 34 ఎకరాల 50 సెంట్ల భూమిని గుడిహత్నూర్‌కు చెందిన కరీం అలీ, సలీం అలీ వద్ద నుంచి సోదరులతో కలిసి కొనుగోలు చేశామని కాగజ్‌నగర్ పట్టణానికి చెందిన గజ్జల సురేశ్ తెలిపారు. ప్రాణహిత ప్రాజెక్టు కాలువల నిర్మాణంలో 13 ఎకరాల 21 సెంట్లకు ప్రభుత్వం పరిహారం అందించిందన్నారు. మిగితా 21 ఎకరాల 29 సెంట్లకు సంబంధించి పట్టా పాసు పుస్తకాలు కూడా ఉన్నాయని ఆయన పేర్కొంటున్నారు. అలాగే భూపాల్‌పల్లికి చెందిన భిక్షపతిగౌడ్ అదే సర్వే నంబర్లలో భూమిని కొనుగోలు చేశానని వాదించడంతో వివాదం మొదలైంది. ఇరువర్గాల ఫిర్యాదు మేరకు 35 మందిపై కేసులు కూడా నమోదయ్యాయి. డీఎస్పీ ఆదివారం కౌటాల సీఐ సాదిక్ పాషాతో కలిసి వివాదస్పద భూమిలో హద్దులు పరిశీలించారు. భూతగాదాలు ఉంటే సంబంధిత రెవెన్యూ అధికారులను, పోలీసులను సంప్రదించాలని సూచించారు.